నూరేళ్ళ తెలుగు కథకు

నవ్య నీరాజనం - 29



రచనలు తిరుగుటపాలో ఇల్లు చేరుతున్నా నిరుత్సాహ పడకుండా, పలుమార్లు ప్రయత్నించి ఆఖరికి సాధించి మొదటి నవల 'పాణిగ్రహం'తోనే పాపులర్ అయి, నేటికీ అదే వేగంతో కలాన్ని పరిగెత్తిస్తున్న రచయిత్రి శ్రీమతి పోల్కంపల్లి శాంతాదేవి. చిన్ననాటి నుంచీ సమాజాన్ని తనదైన దృష్టితో చూసే నైజం, తాత్విక, ఆధ్యాత్మిక చింతనా చైతన్యం, వ్యవస్థలోని మార్పుల్ని నిశితంగా పరిశీలించే పోల్కంపల్లికి ప్రత్యేక సంచికల రచయిత్రిగా పేరుంది. నాలుగున్నర దశాబ్దాలుగా పాఠకుల్ని అలరిస్తున్న శాంతాదేవితో ఇంటర్వ్యూ.

# డిటెక్టివ్ సాహిత్యమే నన్ను రచయిత్రిని చేసింది!

## - పోల్కంపల్లి శాంతాదేవి

### చిన్ననాటి ముచ్చట

నాన్నగారు నూగూరు హనుమంతరావు, అమ్మ సీతమ్మ. నాన్నగారు వనపర్తి సంస్థానంలో ఉద్యోగం చేసి, పదవీ విరమణ తర్వాత కరణీకం చేశారు. 66 ఏళ్ల కిందట వనపర్తిలో మా అమ్మకి పదహారవ సంతానంగా పుట్టాను. అప్పటికే మా అమ్మ కాన్పులతో విసిగిపోయి 'చాలుచాలు శాంతమ్మ' అని నా పేరు పెట్టుకుందిట. తెలంగాణా ప్రాంతంలో అట్లా అంటే కాన్పులు ఆగిపోతాయని నమ్మకం. నమ్మకమో! కాకతాళీయమో నా తర్వాత మా అమ్మకి కాన్పులు ఆగిపోయాయి. మా రెండో అక్కకి పిల్లలు లేక పోవడంతో పురిట్లోనే నన్ను తీసికెళ్లి దత్తత చేసుకుని పెంచుకుంది. అక్కా బావే అమ్మా నాన్న అయ్యారు. మా బావగారు (దత్తు తండ్రి) సంజీవరావు గారు హైస్కూల్లో లెక్కల టీచరు.

ఏడెనిమిదేళ్లు వచ్చేవరకు స్కూలుకి పంపలేదు. ఇంట్లోనే కాస్త ఇంగ్లీషు, తెలుగు వాచకాలు చెప్పి ఒకేసారి నాలుగో తరగతిలో చేర్చారు. నాకు నాలుగో తరగతి స్టాండర్డ్ లేకపోయినా ఆ టీచర్ సంజీవరావు గారి శిష్యురాలు గనక చేర్చుకుంది. అందుకే నా చదువు అత్తెసరు మార్కులతో సాగి తొమ్మిదో తరగతితో ఆగిపోయింది. తర్వాత ప్రైవేట్‌గా మెట్రిక్ చదివి పాసయ్యాను. నాకు ఇద్దరబ్బాయిలు. ఒకమ్మాయి. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి.

### సాహితీ స్ఫూర్తి

అనివార్యంగా తొమ్మిదో తరగతి డిస్ కంటిన్యూ చేసి ఇంట్లో ఖాళీగా వున్న సమయంలో చాలా పుస్తకాలు చదివే అవకాశం కలిగింది. అనువాద నవలలు, తెలుగు నవలలు ముఖ్యంగా శరత్ సాహిత్యం చదివాను. రచనా రంగంలో అడుగుపెట్టిన తొలిరోజుల్లో నా రచనల మీద శరత్ ప్రభావం చాలానే వుంది. మెల్లగా ఆ ప్రభావం నుండి బైటపడి సొంతబాణి ఏర్పర్చుకున్నాను. అలాగే 50 ఏళ్ల క్రితం 'పెబ్బేరు' అనే పల్లెటూరిలో వుండేవాళ్లం. కాస్త తెలుగు చదవడం వచ్చిన పల్లెటూరి యువకులకి డిటెక్టివ్‌లు కరభూషణాలుగా వుండేవి. డిటెక్టివ్ భయంకర్, విషకన్య, నెరజాణ (జానపదాలు) వగైరా నేను చదివాను. నేను కథలు, నవలలు రాయడం మొదలు పెట్టాకా సన్నివేశాలను సహజంగా చిత్రీకరించడంలో నాటి డిటెక్టివ్ సాహిత్య పఠనం దోహద పడిందని చెప్పక తప్పదు.

## చదివిన మొదటి కథ

మొదటి కథ అని ప్రత్యేకంగా గుర్తులేదుగాని బాగా చిన్నప్పుడు చదివిన కథ గుర్తుంది. రచయిత పేరు, పాత్రలు గుర్తులేవు. భారతిలో చదివిన జ్ఞాపకం. ఒక ప్రాక్టీసున్న డాక్టరు. ఒకరు ఈగలు తోలుకునే డాక్టరు. రెండో డాక్టర్‌కి మొదటి డాక్టర్ మీద ఈర్ష్య. అందుకని చాణుక్యుడు విషకన్యను ప్రయోగించినట్లు తన ప్రియురాలిని పేషెంట్‌లా ఆ డాక్టర్ దగ్గరికి పంపిస్తాడు. ఆమె అతడిని వల్లో వేసుకుంటుంది. తాగుడు నేర్పుతుంది. ఆఖరికి అతని ఆస్పత్రి మూతపడి పేషెంట్లు రెండో డాక్టర్ దగ్గరికి వస్తారు. ప్రియురాలు వచ్చి మొదటివాడు పతనమవడానికి ఇంకేం లేదంటుంది. అతను నవ్వుతాడు. ఆమె పశ్చాత్తాప పడుతుంది. 1950-55లలో వచ్చింది.


కుటుంబ సభ్యులతో...

## నా మొదటి కథ

1965లో ఆంధ్రప్రభ వీక్లీలో వచ్చిన 'విశ్వేశ్వరి' నా మొదటి కథ. ప్రేమ, త్యాగం బాగా ఇష్టపడే ఆ రోజుల్లోని కథాంశం. బీద పూజారి కూతురు, కరణం గారబ్బాయికి స్నేహం, ప్రణయం, కులం, శాఖ పట్టింపు వున్న ఛాందసుల ఇంటి ఆడపడచుగా తల్లిదండ్రుల్ని ఎదిరించలేక వేరే పెళ్లికి వొప్పుకుంటుంది. కొడుకు పుట్టాకా భర్త మరణిస్తాడు. కరణం గారబ్బాయికీ పెళ్లయి కూతురు పుడుతుంది. వాళ్లు పెద్దయి ఒకరినొకరు ఇష్టపడతారు. విశ్వేశ్వరి దగ్గరుండి తన కొడుకు, కరణం గారబ్బాయి రామకృష్ణ కూతురు సురేఖకి పెళ్లి జరిపిస్తుంది.

## సాహిత్య ధోరణులు


ఆనాటి కథ, కవిత, నవల ఏది రాసినా, చూసినా అంతర్లీనంగా సమాజానికి ఒక సందేశం, చెడు నడతగల వాళ్లకి కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు వుండేవి. విషయ పరిజ్ఞానం పెంచుకోడానికి ఈనాడున్నన్ని అవకాశాలు ఆనాడు లేవు. కానీ జీవితం పట్ల అవగాహన, ధర్మాధర్మ విచక్షణకి తక్కువుండేది కాదు. అప్పటి రచనల్లో మానవత్వానికి పెద్ద పీట. అనుబంధాలు, ఆత్మీయతలకి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చే వారు. ఇప్పుడు ఆ వాదం, ఈ వాదం అంటూ అసలైన మానవతావాదాన్ని మరిచి పోతున్నారేమో అనిపిస్తోంది. సమాజం ఎలా వుంటే సాహిత్యమూ దాన్ని ప్రతిబింబిస్తుంది. అలా అని ఆనాటి రచనలే బాగున్నాయని, ఇప్పటివి కావని చెప్పడం లేదు. నవలల్ని పక్కన బెట్టి కథల్నిచూస్తే ఈనాడు అన్నీకాకపోయినా కొన్నయినా హృదయాల్ని తట్టే కథలొస్తున్నాయి. వ్యధార్త జీవితాన్ని ఆవిష్కరించి కంటతడి పెట్టిస్తున్నాయి.

### నచ్చినవి

**రచయిత:** శరత్‌బాబు
**కథ:** దోషగుణం (చలం)
**సినిమా:** మాయాబజార్
**గాయని:** ఆర్.బాలసరస్వతి
**గాయకుడు:** ఎస్.సి.బాలసుబ్రహ్మణ్యం
**హీరో:** శోభన్‌బాబు
**హీరోయిన్:** సావిత్రి
**ప్రాణ స్నేహితురాలు:** వావికొలను రాజ్యలక్ష్మి (మా ఆడపడచు, పెళ్లికి ముందు నుంచే నా స్నేహితురాలు)
**సన్నిహిత బంధువు:** ప్రొఫెసర్ ఎస్వీ రామారావు (విశ్రాంత డీన్, ఉస్మానియా వర్శిటీ, రామారావు తండ్రి నాకు కజిన్ బ్రదర్)
**వంటకం:** కాలీఫ్లవర్ కూర
**స్వీట్:** జిలేబీ

## గర్వపడిన సందర్భాలు

తొలిరోజుల్లో నాకు గుర్తింపు తెచ్చిన నవల 'బాటసారి'. మా ఊళ్లో ఒక డాక్టర్‌ని స్ఫూర్తిగా తీసుకుని నవలలో శ్రీకాంత్ పాత్రని ఆదర్శవంతంగా చిత్రించాను. ఆ నవల వచ్చిన పాతికేళ్ల తర్వాత అనపర్తి నుండి ఓ ఇంగ్లీష్ లెక్చరర్. ఆ నవల తనకి నచ్చిన నవలని, అందులో డా. శ్రీకాంత్ లాంటి వ్యక్తిని చూశానని, అతనికి ఈ 'బాటసారి' ప్రెజెంట్ చేయాలనుకుంటే ఎక్కడా దొరకలేదు. మీ దగ్గరుంటే కాపీ పంపమని రాశారు. కాలంతో పాటు కొట్టుకు పోకుండా రచన నిలబడిందన్న ఆత్మ సంతృప్తి కలిగింది.




అలాగే కళాప్రపూర్ణ వేదుల సూర్యనారాయణశర్మ గారు 'ప్రేమికారాణి', 'తామర పువ్వు', డైరెక్ట్ నవలలు చదివి 'స్త్రీల సమస్యల పట్ల అవగాహన వున్న రచయిత్రిగా' అభినందిస్తూ 'తామర పువ్వు'లో దొర్లిన ఒక చిన్నతప్పును సహృదయంతో సవరిస్తూ ఉత్తరం రాశారు. అంత పెద్ద వారు అలా ఉత్తరం ద్వారా అభినందనలు, అశీర్వచనాలు అందచేయడం ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగించింది.

1996-97ల్లో 'అష్టదళం' నవల 50 వారాల మెగా సీరియల్‌గా ఒక వారపత్రికలో వచ్చింది. సీరియల్ ప్రారంభానికి ముందు 12, 13 వారాల పాటు ఫుల్‌పేజీ కలర్ చిత్రాలు వేసి రచయిత పేరు ప్రకటించకుండా అష్టకళ పద్మం ఇచ్చి పేరు కనుక్కోమని, బహుమతి ప్రకటించారు. భయానక, సస్పెన్స్ థ్రిల్లర్ అది. అంతా మగ రచయితల పేర్లు రాశారు. చివరికి ఒక క్లూ ఇచ్చారు. అయినా చాలా తక్కువమంది నా పేరు రాశారు. '14 వారాల పాటు ఇచ్చిన ప్రకటనకి పాఠకుల నుండి వేలాది పోస్ట్ కార్డులు వచ్చాయి. క్లూ ఇచ్చేదాకా 'రచయిత్రి' అని ఎవరూ ఊహించలేక పోయారు' అని పత్రిక వారు ప్రకటించారు.

## ధ్యానయోగం

పొద్దువాలుతున్న వయసులో మనసు అంతర్ముఖమై దేనికోసమో వెతుకుతున్న సమయంలో ఆశ్చర్య సంఘటన జరిగింది. తెలిసిన వారి ద్వారా 'బుద్ధా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ' వారు మా ఇంటికి వచ్చారు. కర్నూలు కేంద్రంగా ప్రారంభమైన సొసైటీ ఇప్పుడు చాలా చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. వచ్చిన ఐదుగురిలో రెడ్డిగారు ధ్యానపద్ధతి చూపించారు. వారిలో డాక్టర్ ఒకాయన 'జీవితం గురించి మీ అభిప్రాయం ఏమిటి?' అనడిగారు. నా రచనల్లో ఎన్నో జీవితాలను చిత్రించిన నేను ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేక పోయాను. సమయం వస్తే గురువులే శిష్యుల్ని వెతుక్కుంటూ వస్తారన్నట్లు వారి రాకతో నన్ను నేను తెలుసుకున్నాను. ధ్యానం జీవితంలో భాగమైంది. తర్వాత ఋషి ప్రభాకర్ సిద్ధ సమాధి యోగా శిక్షణ పొంది 'యోగ' నేర్చుకున్నాను.

## నిజాలు చెప్పాలని తపన

నా తొలి కథ అచ్చయిన ఉత్సాహంతోనే ఇప్పటికీ రాస్తున్నాను. ఓ మంచి కథ చదువు తున్నపుడో, దృశ్యం చూసినప్పుడో స్ఫురించే ఊహలే చాలావరకు కథలు, నవలలుగా రూపుదిద్దుకున్నాయి. కొన్నిచూసిన, విన్న యదార్థ సంఘటనలు కూడా కథలు, నవలలుగా మారాయి. వాస్తవం రాసినప్పుడు కొందరిని నొప్పించాయి. సహజం. కొందర్ని చైతన్య పరిచి, ఆలోచింప చేసి, సంతోష పరిచాయి.

స్త్రీ వాదం, ఇతర వాదాలంటే - ఇజాలన్నవిగాక నిజాలు చెప్పాలన్న తపనతోనే రచనలు చేస్తుంటాను. భవిష్యత్‌లో మహిళాభివృద్ధిపై చక్కని నవల, తాత్వికాంశంతో మరో నవల రాయాలని ఆకాంక్ష.

రచయిత నిరంతరం ఎదుగుతూనే వుండాలి. పరిశీలనా దృష్టి పెంచుకోవాలి.

**-కె.బి.లక్ష్మి**

నాకు నచ్చిన నా కథ

# నివురు తొలగిన నిప్పు

- పోల్కంపల్లి శాంతాదేవి

"మీ అమ్మ ఉందా?"

అరుగుమీద గచ్చకాయలు ఆడుకొంటుంది రాధ ఒక్కతే! తలెత్తి చూసింది. పక్కింట్లో ఉండే తాయారమ్మ కొడుకు రమణ పీరుకట్టెలా పొడుగ్గా, ఇస్త్రీలేని కాటన్‌పాంట్, కాటన్‌షొక్కా వేసుకొన్నాడు. జుట్టుకు కొబ్బరినూనె లేక ఎన్నిరోజులైందో, ఎర్రగా రాగి రంగువేసినట్టుగా ఉన్నాయి. ఒంటిరంగు తెలుపే కాని, రక్తం లేక, వెలసిపోయిన గుడ్డలా ఉంది. తిండిలేక ఎండుకు పోయినట్టుగా ఉన్న చెంపలు. కాని, పొడుగాటి ముక్కు, చురుకైన పెద్దపెద్దకళ్ళు. అతడినంత తేలిగ్గా తీసివేయనీయవు!

"ఎందుకూ?" దీర్ఘం తీసింది.

"ఇవతలికి పిలుస్తావా?"

అతడు చేతిలో గ్లాసు పట్టుకు ఉండడం చూసి, "పాలు కావాలా? లేవు. రాతాలకి పోసేశారు" అంది.

"పాలు కాదు. కొంచెం మజ్జిగ కావాలి".

రాధ లోపలికి వెళ్ళింది. "తాయారమ్మ కొడుకు వచ్చాడమ్మా! మజ్జిగ కావాలట!"

"పాలన్నీ రాతాలకి పోసేస్తాం. మజ్జిగెక్కడుంటుంది?"

"చెప్పుదువు రా!"

"ఈ ముక్క చెప్పడానికి చేతిలో పని వదిలేసి రావాలా?" విసుక్కుంది సీతమ్మ. ఆమె గేదెలకి తవుడు పెడుతూంది. పది గేదెలున్నాయి. అందులో అయిదు గేదెలు వట్టిపోయాయి. వేసవి వచ్చేసిందేమో, ఇచ్చేవికూడా చేరెడు చేరెడు రాల్చుతున్నాయి. రాతాలకి చాలక నీళ్ళడోస్ పెంచాల్సి వస్తూంది, పోయించుకొనేవాళ్లు ఎన్ని తిట్లుతిట్టినా, కాస్త టీకి, తోడు పెట్టుకోడానికి పాలు ఓ అర్ధ లీటరు ఉంచుకొని మిగతావన్నీ అమ్మేస్తుంది. అన్నంలోకి పాలు పోసుకొంటామని, పిల్లలేడ్చినా సరే, పాలు రాతాలకి పోసేస్తుంది.

తవుడు కలిపిన చేతుల్తోనే ఇవతలికి వచ్చింది సీతమ్మ. "ఏం నాయనా?"

"వేడి చేసి కళ్ళు మండుతున్నాయండీ! కొంచెం మజ్జిగ పోయించుకుపోదామని వచ్చాను".

గేదెలు సగం వట్టిపోయాయి. మిగతావి పాలు తగ్గించేశాయి! రాతాలకే పాలు చాలడం లేదు. ఇక ఇంట్లో మజ్జిగెక్కడుంటుంది? రాత్రి తోడుపెట్టిన పావు లీటరు పాలు చిలికితే అందులో కాస్త మజ్జిగ పోయొచ్చు! కాని, లేదని చెప్పడమే సులభం కొందరికి. అయ్యో, గ్లాసు పట్టుకు ఇంటి ముందుకు వచ్చాడే, ఎప్పుడూ రాని వాడు, వేడి చేసిందని చెబుతున్నాడే. తాము పోసుకొనే మజ్జిగలోనే ఓ గ్లాసుడు నీళ్ళెక్కువ పోసి, అతడికి కాస్త పోస్తే తలుచుకొంటాడన్న ఆలోచన రాలేదు సీతమ్మకు.

గ్లాసుడు మజ్జిగ పొయ్యడం పెద్ద ఉపకారమేమి కాదు. కాని, అతడున్న పరిస్థితిలో ఆ గ్లాసుడు మజ్జిగ సీతమ్మ నుండి పొంది ఉంటే, అతడి మనసులో మాత్రం కొండంత విశ్వాసం కలిగేదేమో ఆమె మీద! కృతజ్ఞతతో హృదయం నిండిపోయేది.

ఎప్పుడూ అడగని వాళ్ళు అడిగి లేదనిపించుకొంటే ఎదురయ్యే బాధ రమణ ముఖంలో కదిలింది. దెబ్బతిన్న అభిమానంతో కాళీగ్లాసుతో వెనుదిరిగాడు రమణ.

అతడు పొందిన ఆశాభంగం గమనించే తీరికలేనట్టుగా విసవిసా లోపలికి వెళ్ళిపోయింది సీతమ్మ.

ఇంటికి వచ్చాడు రమణ. గ్లాసు పక్కనపెట్టి తను చదువుకొనే చాపమీద కూర్చున్నాడు. కళ్ళు వేడితో భగభగ మండుతున్నాయి. గొంతులో ముక్కులో వేడి ఆవిర్లు వస్తున్నాయి. ఒక గ్లాసుడు మజ్జిగ కోసం మనసు తహతహ లాడుతుంది. ఎక్కడైనా పెరుగుకొని తెచ్చుకుందామన్నా అమ్మ దగ్గర ఒక్క నయాపైసా లేదని తెలుసు.

"అన్నం పెట్టానురా!" తాయారమ్మ వచ్చి పిలిచింది.

"అన్నం లోకి ఏం చేశావమ్మా?"

"దొడ్లో చెట్లకి నాలుగు మిరపకాయలు, రెండు బెండకాయలు కాశాయి! వాటిని నిప్పుమీద కాల్చి పెట్టాను!"

రమణకు ఆకలి చచ్చిపోయినట్టుగా అయింది. "అమ్మా! యీ దరిద్రంలో చదువు చదవలేనమ్మా! మానేసి ఏదైనా ఉద్యోగం చూచుకొంటాను".

"ఉద్యోగాలు అంత తేలిగ్గా దొరుకుతున్నాయా?"

"ప్రయత్నిస్తూంటే ఏదో ఒకటి దొరక్కపోతుందా?"

"అది దొరికేవరకు మాత్రం చదువు ఆపకు!"

తాయారమ్మకి రెండురోజుల నుండి జ్వరం వస్తూంది. బియ్యం రవ్వగా విసురుకొని జావగా కాచుకొని కాస్త ఉప్పువేసుకు తాగుతుంది. జ్వరం వస్తే ఆమెకు అదేమందు. ఏ డాక్టరు దగ్గరికో వెళ్ళడానికి ఆమె దగ్గర డబ్బులేదు.

కొడుకు ఏడాది వయసప్పుడు భర్త హఠాత్తుగా పోయాడు. పల్లెలో కాస్త పొలమూ, ఈ పట్నంలో రెండు గదులుగా ఉన్న పెంకుటిల్లు తనకు ఆధారంగా వదిలేసి, పొలం మీద తిండికి బియ్యం వస్తాయి. పై ఖర్చులకూ, పిల్లాడి చదువు ఖర్చుకూ రాట్నం వడకడానికి వెళ్ళేది. ఈ రెండు మూడేళ్ళుగా ఆమె ఆరోగ్యం చెడిపోయి, ఆ పని మానేసింది. ఎవరింటికీ వెళ్ళదు. ఎవరూ స్నేహితులు లేరు. ఇరుగు పొరుగులతో మాటామంతీ ఉండదు. ఉన్నది వండడం, కొడుక్కు పెట్టి, తనింత తినడం, కళ్ళు మూసుకుని పడుకోవడం – ఇదీ దినచర్య. ఆ చుట్టుపక్కల ఆ అయిదారిళ్ళ వాళ్ళకి తప్ప తాయారమ్మ అనే ఓ పేదరాలు తన కొడుకుతో ఆ పెంకుటింట్లో ఉన్న సంగతి తెలియదు.

ఆమెకు తగవులూ, స్నేహాలూ లేనట్టే రమణకి కూడా. రమణ కూడా ఎవరిళ్ళకూ వెళ్ళడు. కాలేజీ ఇల్లు. బాగా చదువుకొని పరీక్ష పాస్ కాకపోతే మళ్ళీ చదివించే శక్తి తల్లికి లేదని తెలుసు కాబట్టి భయంతో, శ్రద్ధతో చదువుతాడు. ఏటా ఫస్ట్ క్లాసులో పాసవుతాడు. మెరిట్ స్కాలర్‌షిప్ డబ్బు పుస్తకాలకీ, ఫీజులకీ మరీ

ఇబ్బంది పడకుండా చేస్తుంది.

***

"గుడ్ మార్నింగ్, సర్!"

"ఎవరూ?" చదువుతున్న పేపరులోంచి తలెత్తి కళ్ళజోడు సవరించుకు మరీ చూశాడు ఈశ్వర రావు. ఎదురుగా ఓ ఇరవైయేళ్ళలోపు కుర్రాడు విధేయతతో చేతులు కట్టుకు నిలబడి ఉన్నాడు. ఎక్కడో చూసినట్టుంది. ఎక్కడ చూశాడో గుర్తు రాలేదు. "ఎవరబ్బాయివి? ఏం కావాలి?"

ఆ అడిగిన తీరుకే సగం ప్రాణం చచ్చిపోయింది రమణకు. తమ పెంకుటింటికి ఎదురుగా ఉండే మేడ ఈశ్వరరావుది. ఆయన పేరు మోసిన లాయరు. చిన్నప్పటి నుండి ఆయన్ని చూస్తున్నాడు. ఇంటిముందు ఇల్లు.

తనని చూడకుండా ఉంటాడా? ఆయన్ని తనింత చిరపరిచితంగా భావిస్తుంటే తనని ఆయన ఏమంటున్నాడు. 'ఎవరబ్బాయివి? ఏం కావాలి?'



కాని, అభిమానపడి వెనక్కి వెళ్ళిపోయే సమయం కాదు తనది. అవసరం తనది. అభిమానపడితే నష్టపోయేది తను – ఆయన కాదు.

"సర్! నేను మీ ఎదురింట్లో ఉంటాను. మీరు రోజూ నన్ను చూస్తూనే ఉంటారు" ఎందుకో గొంతుక పట్టుకు పోయినట్టుగా అవుతూంది.

"ఓ! ఆ ముసలావిడ కొడుకువా?"

నలభైయేళ్ళు నిండకుండానే అమ్మ ముసలావిడ అయిందా? బక్కచిక్కిన శరీరం, బ్రతుకు భారంతో తెల్లబడిపోయిన తల ఆమె వయసుని పెంచి చూపుతూంటే అలా అనడంలో ఆయనదేం తప్పు?

"నాన్నగారు చిన్నప్పుడే పోయారు. అమ్మ ఇంతవరకు కష్టపడి చదివించింది. ఇప్పుడు ఆమె పని అయిపోయింది. ఈసారి ఫీజు కట్టకపోతే ఇన్నాళ్ళు నేను చదివిందంతా వ్యర్థమై పోతుంది. ఒక్క వంద రూపాయల సహాయం చేశారా, నాకు ఉద్యోగం దొరుకుతూనే మీ రుణం, ముందుగా తీర్చుకొంటాను!".

ఈశ్వరరావు మాట్లాడలేదు. లోపలికి వెళ్ళి రెండు నిమిషాల్లో వచ్చాడు, ఐదు రూపాయల నోటుతో.

"ఇది తీసికెళ్ళు! ఇలాగే నాలుగు చోట్లకి తిరిగితే ఫీజు డబ్బులు భర్తీ అవుతాయి!"

"నేను అడిగింది సహాయం, చందా కాదు" ముఖం ఎర్రబడిపోగా అన్నాడు రమణ.

"వంద రూపాయలు నా దగ్గర లేవు. తీసుకుంటే ఇదితీసుకో. లేకుంటే లేదు" నిష్కర్షగా అన్నాడు.

"నా ఫీజుకి అయిదు రూపాయలు తక్కువపడేట్టుంటే, ఈ అయిదు రూపాయల కోసం మళ్ళీ వస్తాను. మీ దగ్గరే ఉంచండి!" రమణ గిరుక్కున వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

"అడుక్కునేవాళ్ళకి కూడా ఇంత అభిమానమేమిటబ్బా!" ఈశ్వరరావు గొంతులో చెప్పలేనంత వెటకారం.

రమణ ఇంటికి వచ్చి మోకాళ్ళ మధ్య తలదాచుకు కూర్చున్నాడు.

"ఏరా? ఏమన్నాడాయన?"

"ముష్టి ఇవ్వడానికి వచ్చాడు"

"మీ కాలేజీలో లెక్చరర్ల దగ్గర ప్రయత్నించలేక పోయావా?"

"నాలాగా ఫీజుకట్టలేని స్టూడెంట్స్ ఎంతమందో? దయచూపుతూ పోతే వాళ్ళ జీతం కాలేజీలోనే ఖర్చుపెట్టి పోవాల్సి వస్తుంది!".


"ఎలాగరా?".

"పరీక్షకు కూర్చోలేను!"

"ఇంత చదివీ..."

చీకటిలో ఉన్న మనిషి బ్రతుకంతా చీకటే అనుకుంటే అసలు బ్రతక లేడు. 'వస్తుంది వెలుగు' అనుకొంటేనే బ్రతుకుతాడు. కొడుకు చదువైపోతే, ఉద్యోగం వచ్చేస్తే ఈ దరిద్రం వదిలిపోతుంది కదా అన్నట్టు ఆశతో బ్రతుకుతూంది తాయారమ్మ. కొడుకు చదువు ఆగిపోతే ఉద్యోగం దొరక్క పోతే మూసుకుపోయిన చీకటి గుహలో జీవితంలా అయిపోతుంది.

కొన్ని సంవత్సరాల తరువాత మొదటిసారిగా గడప దాటింది తాయారమ్మ. చిరుగుల చీరతో వీధిలో నడవాలంటే ప్రాణం చచ్చినంత పనిగా ఉంది. చిరుగుల్ని



మాటిమాటికి కప్పుకొంటూ, నాలుగిళ్ళ అవతల ఉన్న శారదమ్మ ఇంటికి వెళ్ళింది. శారదమ్మదీ లేని సంసారమే. రాట్నం వడికేప్పుడు తనతో వచ్చేది. పరిస్థితి చెప్పి అడుక్కుంటే ఎక్కడైనా చూస్తుందేమోనని ఆశ.

''బాగున్నావా? చాలా రోజులకి కనిపించావు!'' శారదమ్మ మామూలుగా పలకరించింది.

''ఆс. బాగున్నావా శారదమ్మా?''

''ఇలా వచ్చావు''

''పని బడే''.

''.........'' ప్రశ్నార్థకంగా చూసింది శారదమ్మ.

''ఎవరే?'' మంచంలో ముసలావిడ అడిగింది.

''తాయారమ్మ అని మనకు నాలుగిళ్ళ అవతల ఉంటుంది.... ఆరోగ్యం బాగుండలేదా తాయారమ్మా? బాగా చిక్కిపోయావు?''


''జ్వరం వస్తూంది ఈ మధ్య తరచుగా, ఈమె ఎవరూ?''

''మా పెద్దమ్మ! ఏడాది క్రింద ఉన్న ఒక్క కొడుకూ పోయాడు. ఒక్కదానివి ఎలా ఉంటావు, రమ్మని పిలిస్తే వచ్చింది. ఇక్కడే ఉంటుంది!''

డబ్బు అడగడానికి వచ్చింది గాని అంత తేలిగ్గా అడగలేకపోతూంది. అడిగి లేదనిపించుకోవాల్సి వస్తుందేమో! అడగకుండా వెళ్ళిపోతే? వచ్చింది ఎందుకు? అదృష్టం ఎక్కడ ప్రత్యక్షమౌతుందో ఎవరు చెప్పగలరు?

ఆ మాటా ఈ మాటా దొర్లుతూంది.

కాని, అడగలేకపోతూంది అప్పు. పేదతనం గుట్టుగా భరించడం నేర్చుకొన్న తరువాత తమ దైన్య పరిస్థితి బయటపెట్టుకోవాలంటే చెప్పలేనంత అభిమానం అడ్డు వస్తుంది.



''మీ అబ్బాయి చదువు అయిపోయిందా?''

''ఈ ఏటితో గట్టెక్కుతాడు. కాని, ఇప్పుడు నువ్వు ఫీజుకు సాయం చేసి పుణ్యం కట్టుకో గలిగితే?'' తాయారమ్మ గొంతుకేదో అడ్డం పడ్డట్టయింది.

''దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షు అన్నారు. అలా ఉంది బ్రతుకు. నేనేం సాయం చేస్తాను. నా పిల్లల్ని చదివించ లేకే ఒకణ్ని పేపర్లు పంచడానికి, ఒకడిని కార్లు తుడవడానికి పంపాను.''

''మా రమణకి చిన్నప్పటి నుండి పిచ్చిప్రేమ చదువంటే. చదువులో వాడి ఇష్టాన్నీ తెలివితేటల్నీ నా దరిద్రానికి బలిపెట్టలేక పోయాను. ఎలాగో వాణ్ని బి.ఏ. దాకా లాక్కురాగలిగాను. ఈ సారి ఫీజు కట్టడం మాత్రం కైలాసపటంలో అంతెత్తుకు వెళ్ళి పెద్ద పామునోట్లో పడ్డట్టుగా అవుతూంది. ఇన్నాళ్ళు వాడు కష్టపడి చదివిందంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది. అసలు, వాడు పరీక్షకు కూర్చోలేకపోతే ఆ నిరాశతో, బాధతో ఏ రైలు చక్రాల క్రింద తల పెట్టేస్తాడోనని భయమేస్తుంది''. అభిమానం కరిగి ఏడుపు రూపంగా ప్రవహించసాగింది.

ఆమె ఏడుపు శారదమ్మ మీద ప్రభావం చూపలేదు గాని, మంచంలో పడుకొని వింటున్న ముసలావిడ కదిలిపోయింది. దానికి కారణం ఉంది. ఆమెకు ఒక్కడే కొడుకు. వాణ్ని పెద్ద చదువులు చదివించాలని ఎంతగా ఆశపడిందో? చదవరా అనివాణ్ని ఎంతగా వేధించేదో, వాడేమో స్కూల్ ఎగ్గొట్టి తిరిగేవాడు. పదో తరగతిలో ఏడుసార్లు తప్పినా, వాడి నంబరు పేపరులో చూసి తీరాలన్న పట్టుదల కొద్దీ ఫీజు కడుతూనే ఉంది. ఎనిమిదోసారి పరీక్షల ముందు టైఫాయిడ్ వచ్చి పోయాడు. ఏడ్చిఏడ్చి తనుపోలేదు గాని కళ్ళు మాత్రం పోయాయి. తాయరమ్మ ఆకారం మసక మసకగా కనిపిస్తూంది ఆమెకు.

''బాగా చదివే కుర్రాడంటున్నావు! చక్కగా చదువుకొనే పిల్లలంటే నాకెంత ఇష్టమో! నా కొడుకును బాగా చదివించాలని ఎంత ఆశపడ్డానో? నా ఆశలన్నీ కూల్చి వాడు టైఫాయిడ్‌తో వచ్చిపోయాడు'' ముసలామె దుఃఖస్వరంతో అంది. ''ఎంత కట్టాలమ్మా ఫీజు''.

''వంద కావాలంటున్నాడండీ!''

''కళ్ళు ఆపరేషన్ చేయించుకోవాలని నా దగ్గర రెండు వందలు దాచుకొన్నాను. ఆపరేషన్ చేయించుకొంటే కళ్ళు వస్తాయో, ఉన్న కళ్ళు పోతాయో దైవాధీనం కదా? ఆపరేషన్ సంక్రాంతి పంట చేతికి వచ్చినప్పుడు చేయించుకుంటాను గాని ఈ వంద తీసికెళ్ళి నీ పిల్లాడికి ఫీజు కట్టు. బుద్ధిగా చదువుకొనే వాళ్ళంటే నా కెంత ఇష్టమో! చదువుకోరా అంటూ నేను పోరుపెడుతూంటే ఆ పోరు పడలేకేమో వాడు పైకెళ్ళి పోయాడు.'' ముసలామె ఒకసారి కళ్ళొత్తుకొని జాకెట్‌లోంచి గుడ్డ సంచీ బయటికి తీసింది. ''శారదా! ఇందులో రెండు వందలుండాలి! ఒక వంద ఆమెకు లెక్కపెట్టి ఇవ్వవే!''

''చీర కొనుక్కుంటాను. తరువాత ఇస్తాగాని ఓ ఏభై రూపాయలిమ్మంటే లేదన్నావే'' చిటపటలాడి పోయింది శారదమ్మ.

''పరాయి పిల్లాడే కావచ్చు! అతడిది చదువుకదే! చదువెక్కువా, చీరెక్కువా? చీర చిరిగి పోతుంది. చదువు ఉండి పోతుంది. అన్ని దానాల్లో విద్యాదానం గొప్పదన్నారే! బాగా చదివే కుర్రాళ్ళంటే నా కెంత ప్రేమో! సాయంత్రం ఒకసారి నీ కొడుకును పంపిస్తావా?''

''దిక్కు లేకుండా పడిచస్తున్నావు కదా అని పిలుచుకొని వండి వార్చి పెడుతున్నాను. ఒక్క చీర కొనుక్కుంటాను అంటే 'నా దగ్గరెక్కడిదే డబ్బు? అన్నావు. ముక్కుమొహం తెలియని దానికి అంత డబ్బివ్వడానికి నీకు చేతులు వస్తున్నాయి''.

''నా కొడుక్కు ఉద్యోగమైతే వడ్డీతో తీర్చుకుంటాను శారదమ్మా?'' వాళ్ళిద్దరికీ మధ్య కలతపెట్టానే అని నొచ్చుకుంటూ అంది తాయారమ్మ.

''ఇస్తావో, ఎగ్గొడతావో నా కెందుకమ్మా? ఇచ్చింది ఆమె! పుచ్చుకొంది నువ్వు! మధ్య నాకెందుకు?'' పెద్దమ్మ అందించిన సంచిలోంచి వంద లెక్కపెట్టి తాయారమ్మ చేతిలో కుక్కినట్టుగా పెట్టింది శారదమ్మ.

శారద ముఖంలో కనిపిస్తున్న అక్కసు చూస్తుంటే కొడుక్కు ఫీజు దొరికిందన్న సంతోషం ఎగిరి పోయింది. విధిలేక తీసుకొన్నట్టుగా తీసుకొని ఇంటి ముఖం పట్టింది.

సాయంత్రం ముసలావిడ దగ్గరికి వెళ్ళివచ్చాడు రమణ.

''శారదమ్మ ఆవిణ్ని చాలా దెప్పి పోస్తూందే! ఈ రోజు అన్నం పెట్టడానికి ఎన్నో మాటలందట?''

"పాపం!"

"నన్ను తన మంచం మీద కూర్చోబెట్టుకుని నా చదువు గురించి చాలా అడిగింది. చేతుల్తో తడిమి తడిమి చూచుకుంది. 'వాడు.... వాడు ఇలాగే ఉండేవాడు. కాని చదువంటే మాత్రం పెద్ద చిరాకు' అంటూ ఏడ్చింది. పాపం, ఆవిణ్నిచూస్తే చాలా జాలేసింది".

***

నిన్నటితో పరీక్షలై పోయాయి రమణకు. రాత్రి మనసారా నిద్రపోయాడు. బద్ధకంగా ప్రొద్దెక్కి లేచాడు. దొడ్లో వేపచెట్టు కొమ్మ వంచి, ఓ పుల్లవిరిచి పళ్ళు రుద్దుతూ వాకిట్లో నిలబడి తీరికగా వీధిలోకి చూస్తున్నాడు. ఇన్నిరోజులు చదువులో మునిగిపోయి ప్రపంచం చూడనట్టుగా అనిపిస్తుంది.

ఎదురింటి వరండాలో సోఫాలో కూర్చొన్న ఈశ్వరరావు పేపరు తిప్పేస్తూనే క్లయింట్స్‌తో మాట్లాడుతున్నాడు.

సీతమ్మ ఇంటి ముందు పెద్ద గొడవ అవుతూంది. ఎదురింటి మీనాక్షమ్మ పిల్లను పంపిస్తే ఉట్టి నీళ్ళు కలిపిన పాలు పోసి పంపిందట సీతమ్మ!

"ఇవి పాలా? చెరబుకడిగిన నీళ్ళా? ఈ నీళ్ళు పోసి పైసలు తీసుకోడానికి చేతులెట్లా వచ్చాయి? నీళ్ళమ్మి సంపాదిస్తున్నావే! నీళ్ళపాలై పోతుందే ఆ డబ్బు!" పాలు వాపసు చేయడానికి వచ్చి శాపనార్థాలు పెడుతూంది మీనాక్షమ్మ.

పోసిన పాలు వాపసు ఎందుకు తీసుకొంటాను అంటూంది సీతమ్మ.

జుట్టు జుట్టు పట్టుకొని కొట్టుకొనే దాకా వచ్చింది వ్యవహారం. మధ్యవర్తులు కలుగజేసుకొని ఎవరిళ్ళకు వాళ్ళని పంపేశారు!

రమణ ముఖం కడుక్కొని టీ తాగి వాకిట్లో చేతులు కట్టుకు నిలబడ్డాడు తీరిగ్గా.

ఈశ్వరరావు మేడ పక్కనే చిన్న డాబా యిల్లు ఉంటుంది. ఆ ఇంట్లో సవిత అనే ఓ చక్కనిచుక్క ఉంటుంది. ఆ పిల్లను చూసినప్పుడల్లా రమణ గుండెలెందుకో చిత్రంగా స్పందిస్తాయి. సవిత బడికి వెళ్ళేప్పుడు, వచ్చేప్పుడు రమణకు తారసపడుతుంది. రమణ కళ్ళతో తన కళ్ళు కలవగానే సవిత ముఖం చిరాకు చిరాకుగా, చిందులు వేస్తున్నట్టుగా మారిపోతుంది. ఆ పిల్ల కోపంతో రమణకు పెట్టిన ముద్దుపేరు 'పీరు కట్టె!'.

"ఏయ్, జామపండ్లూ!"

తలంటుకొన్న జుట్టును విరబోసుకొని, పమిటకొంగు ఆదరాబాదరగా సర్దుకొంటూ వీధిలోకి పరిగెత్తుకు వచ్చింది సవిత. పండ్ల వాడు ముందుకు వెళ్ళిపోయాడేమో, సవిత కోయిల్లా సన్నని గొంతుతో పిలిస్తే వినబడనట్టుంది.

"జాంపండ్లూ, జాంపండ్లూ" అంటూ వెళ్ళిపోతున్నాడు.

"ఏయ్, జాం పండ్లూ" మళ్ళీ పిలిచింది సవిత.

వెనుదిరిగి చూడకుండా వెళ్ళిపోతున్నాడు పండ్ల వాడు.

రమణ చేతులు చరుస్తూ గొంతెత్తి పిలిచాడు, "ఏయ్ జామపండ్లూ".

పండ్ల వాడు వెనక్కి తిరిగి ఎవరా అన్నట్టు చూశాడు.

రమణ చేతులూపి పిలిచాడు.

పండ్ల వాడు వచ్చేస్తున్నాడు.

సవిత కృతజ్ఞతగా చూడడానికి బదులు గుర్రుగాచూసింది. ఆడపిల్ల కోపం సరదాగా తీసుకోవడం మగ మనస్తత్వమేమో రమణ చిరునవ్వుతో చూస్తున్నాడు. పండ్ల వాడు సమీపించాడు. "నాకు కాదు. ఆమెకు?"

పండ్ల వాడు అటు రెండడుగులు వేసి సవితా వాళ్ళ గేటులో బుట్ట దింపుకున్నాడు. రమణ కూడా వెళ్ళాడు బేరం చేయడానికన్నట్టుగా.

మూడు నాలుగు రకాల సైజులున్నాయి బుట్టలో. రమణ పళ్ళని చేతిలోకి తీసుకొని ధర అడుగుతున్నాడు. పెద్ద సైజు జామపండ్లు కిలో రెండు రూపాయలు చెబుతున్నాడు పండ్ల వాడు.

"రూపాయిన్నర చేసుకొని ఇవ్వు!"

"తీసుకో బాబూ! మొదటి బోణీ!"

"నాక్కాదు. ఆమెకు!"

"నా కోసం నిన్నెవడు బేరం చేసి పెట్టమన్నాడు. ఆ మాత్రం బేరం చేయడం రాదా నాకు?"

"నువ్వు పిలిస్తే రాలేదు, నేను పిలిస్తేనే వచ్చాడని మరిచిపోకు".

"పిలిస్తే పెద్ద ఏదో ఉపకారం చేసినట్టు ఫోజు! ఈ వంకన నన్ను దగ్గరగా చూడొచ్చుని!"



## కథాంతరంగం

ఆర్థిక స్థితిగతుల మీద మానవీయ సంబంధాలు ఎలా ఆధారపడి వుంటాయో ఈ కథ చెబుతుంది. యోగ్యత వుండీ తగిన సహాయ సహకారాలు లేని సందర్భాల్లో ప్రయత్నం వల్ల అనుకున్నది సాధించడం సాధ్యమవుతుందన్న సందేశాన్ని అందిస్తుంది. బీదరికం భయపెట్టినా, తల్లికృషి, తన పట్టుదలతో జీవన సమరంలో గెలిచిన యువకుడి కథ. ఏరుదాటాకా తెప్ప తగలేయకుండా ఆదుకున్న వారి పట్ల కృతజ్ఞతా భావం వుండాలన్న భావంతో రాసిన కథ ఇది. 1980 యువ దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురితమయింది.

-శ్రీమతి పోల్కంపల్లి శాంతాదేవి
ఇంటి నెం.**46-94**, కెడిఆర్ నగర్,
వనపర్తి - **509 103**, మహబూబ్‌నగర్ జిల్లా
సెల్: **9490302404**

"నిజమే! నిన్ను చూడాలంటే నా కిష్టం!" ఎలాగో ధైర్యం చేసి అన్నాడు. ఇలాంటి సందర్భంలో ఆ వయసే ఇస్తుందేమో ధైర్యం, ఏం జరిగినా ఫర్వాలేదని.

"నిన్ను తన్నాలంటే నా కిష్టం! పీరుకట్టె మొహమూ నువ్వూ!" చేతిలో పట్టుకున్న జామపండు బలం కొద్దీ రమణ ముఖాన కొట్టి లోపలికి తుర్రుమంది.

దెబ్బ ముఖానికి తగిలినా అసలు గాయం హృదయంలో ఏర్పడింది. 'సవితా! నాకు తినడానికి సరైన తిండి ఉంటే నీకంటే అందంగా వుండేవాడిని. నాకు నీలాగా డబ్బున్న తండ్రి ఉంటే హుందాగా ఉండే వాడిని! అప్పుడు నువ్వే నన్ను ఓరకంట చూసేదానివి!' బాధగా మూలిగింది మనసు.

పరీక్షలైన వారం రోజుల్లో ఇదివరకు అతడు పెట్టిన దరఖాస్తుకు ఇంటర్వ్యూ కాల్ వచ్చింది. ఇంటర్వ్యూలో సెలెక్టు అయ్యాడు. జాబ్ ప్రైవేట్‌దయినా నెలకి మూడువందలొస్తాయి.

రమణకి మంచిరోజు లొచ్చినట్టుగా అనిపించాయి. ఆర్థికమైన ఇబ్బందులు తీరిపోయినట్లే! కాని, తన జీవితం ఇక్కడితో ఆగిపోకూడదు! ఉన్నతంగా, నిన్న చిన్నబుచ్చిన వాళ్ళే. తలెత్తి విస్మయంగా చూసేట్టుగా ఎదిగిపోవాలి!

దాదాపు సంవత్సరం తరువాత సంగతి.

ఉదయం స్నానం చేసి, దేవుడి ముందు దీపం వెలిగించి చేతులు జోడించి కళ్ళు మూసుకుంది తాయారమ్మ. చాలారోజుల తరువాత మనసుకు ప్రశాంతంగా ఉంది. ఈది ఈది ఒడ్డుకు చేరిన నిశ్చింత ఉంది ముఖంలో. చికాకులమధ్య ఉన్నప్పుడు దేవుడిముందు వున్నా మనసు అక్కడుండేది కాదు! పిచ్చెత్తినట్టుగా పరిపరి విధాలుగా పరిగెత్తేది! భగవంతుడి మీద భక్తి నిలవాలన్నా ఇహలోకపు సమస్యలుండ కూడదు. డబ్బు చికాకులుండ కూడదు.

"తాయారమ్మా, ఏం చేస్తున్నావమ్మా?"

తాయారమ్మ కళ్ళు తెరిచింది. ఎదురుగా సీతమ్మ నిలబడి ఉంది. చేతిలో పాల చెంబుతో, పాలు అప్పుడే తీసినట్టుంది. నురిగింకా ఆరలేదు.

"మా పెద్దకొమ్ముల గేదె ఈనింది. జున్నుపాలు ఇద్దామని వచ్చాను!" నవ్వుతూ అంది.

తనింటికి సీతమ్మ రావడమే వింత! అదీ, జున్నుపాలు చెంబునిండా తీసుకురావడం మరీ వింత. విస్మయంగా చూడసాగింది.

"మీ రమణ కలెక్టరయ్యాడటగా?"

"అప్పుడే కలెక్టరెక్కడయ్యాడు? ఐ.ఏ.ఎస్.కి సెలక్టయ్యాడు. ఏడాది ట్రెయినింగ్ చేసి రావాలి. తరువాత కదా కలెక్టరో ఏదో"

"ఇవాళ కాకపోతే రేపు అవుతాడు కదమ్మా? అదృష్టమంటే నీది! ఎన్నికష్టాలు పడ్డావు. ఇంటి పక్కన ఉండి నేను చూస్తూనే ఉన్నాగా? మగదిక్కు లేక పోయినా పిల్లాడిని ఒకదారిలో పెట్టి ఇంత చదువు చెప్పించావంటే నీ గొప్పదనం ఇవాళ తెలుస్తుంది నలుగురికీ. ఏం తిన్నావో, ఎలా ఉన్నావో ఒక్కనాడు ఒకరికి చెప్పుకొన్నావా? కొంగుపట్టుకు ఒకరింటికి వెళ్ళావా?" ఒకనాడు రమణ తనింటికి ఒక గ్లాసు మజ్జిగకోసం వచ్చి తిరిగిపోవడం గుర్తువచ్చి మనసు కలుక్కు మంటూంది సీతమ్మకు. కాబోయే కలెక్టరుకు ఒక గ్లాసుడు మజ్జిగ లేదంది కదా! ఆ రోజు ఆ

మజ్జిగ పోసి ఉంటే కుచేలుడు అటుకులు కృష్ణుడికి సమర్పించి పొందినంత లాభం తను పొంది ఉండేది! కనీసం, ఈ కలెక్టర్‌కి ఓ రోజు నేను మజ్జిగ పోశాను అని చెప్పుకోనేందుకైనా ఉండేది.

రమణ అప్పుడే వచ్చి వింటున్నాడు ఆమె స్తోత్రాన్ని. ఒకరోజు ఒంట్లో వేడిచేసి కళ్ళు మండుతుంటే ఎన్నడూ వెళ్ళని ఇంటికి అభిమానం అణుచుకొని వెళ్ళాడు గ్లాసు తీసుకొని. కాళీ గ్లాసుతో తిరిగి వచ్చాడు. ఇవాళ అడగకుండా జున్నుపాలు చెంబునిండా తనింటికి వచ్చాయి. రమణకి తిప్పిపంపాలనిపించింది. కాని, అది అహంకారమౌతుందేమో! ఒకనాడు తమ దీనస్థితి నలుగురినీ తమకు దూరంగా ఉంచింది. ఇవాళ తమ ఉన్నతస్థితి నలుగురినీ అయస్కాంతంలా ఆకర్షిస్తూంది! సమాజ నీతి ఇది!

ఎన్నడూ కన్నెత్తి అయినా చూడని ఆ పెంకుటింటి మీదే ఇప్పుడందరి చూపూ. ఇదివరలో ఆ ఇంట్లో మనుషులు బ్రతికి ఉన్నారా, చచ్చారా అని కూడా చూడని వాళ్ళు ఇవాళ రమణ ఐ.ఎ.ఎస్‌కి సెలెక్టు కావడం అద్భుతంగా చెప్పుకొంటున్నారు.

***

"ఎందుకురా వంద రూపాయలు? మొన్నే ఏభై ఇప్పించుకొన్నావు? నీ ఖర్చులు రోజురోజుకు పెరుగుతూంటే చదువు రోజురోజుకూ తగ్గుతూంది. ఈసారి బి.ఎ. తప్పావో ఇహ మీ నాన్న చచ్చినా చదివించరు."

"పెద్ద చదువు లేకపోతే లేక పోయిందిలేమ్మా! ఏ బిజినెస్సో చూచుకుంటాను!".

"ఆ బిజినెస్‌లో అందరూ పైకొచ్చినట్ట పిచ్చిపిచ్చిగా వాగకు! నాకు మండుకు వస్తుంది ఆ ఎదురింట్లో కుర్రాణ్ణి చూసి సిగ్గూ బుద్ధీ తెచ్చుకో. ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తూనే ఐ.ఎ.ఎస్.కి అప్పియరయ్యాడట, సెలెక్టయ్యాడట."

"ఈ రోజుల్లో ఐ.ఎ.ఎస్. కావడం కూడా ఓ గొప్పే! ప్రతి అడ్డగాడిదా అవుతున్నాడు?"

అటువైపుగా వచ్చిన ఈశ్వరరావు అడిగాడు. "ఎవరికొచ్చింది ఐ.ఎ.ఎస్. సెలక్షన్?"


"మన ఎదురింట్లో కుర్రాడికి?"

"ఎదురిల్లేది?"

"ఇన్నేళ్ళయి ఉంటున్నాం. ఎదురిల్లు కూడా తెలియదు. అలా ఉన్నాం మనుషులం?" మూతి తిప్పింది భార్య.

## ఇక సినిమాలు చేయను....

పవన్‌కల్యాణ్‌తో 'బంగారం' చిత్రంలోనూ, 'వాన'లో హీరోయిన్‌గా చేసిన మీరాచోప్రాకు అదృష్టం ఆమడదూరంలోనే ఉండిపోయింది. ఈ రెండు సినిమాలు మీరాకు ఏమాత్రం పేరు తీసుకురాకపోగా, అవకాశాలు ఇవ్వలేకపోయాయి. ఆమె తాజా చిత్రం 'జగన్మోహిని' మీద కూడా మీరాకు పెద్దగా ఆశలు లేవు. ఈ రంగం తనకు సరిపడదు అనుకుందేమో....సినిమాలు చేయను అంటూ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేసింది. 'జగన్మోహిని'నే నా చివరి చిత్రం అంటూ గుడ్‌బై చెప్పేసింది. సినిమాలు మానేసి బుద్ధిగా మా నాన్న బిజినెస్ చేసుకుంటాను అంటోంది. ఏదో విధంగా అవకాశాలు దక్కించుకొని ఇండస్ట్రీలో స్థిర పడాలనుకునే వారే ఎక్కువ మంది ఉండగా, దానికి భిన్నంగా మీరా చోప్రా నిర్ణయం పలువురిని ఆశ్చర్య పరిచినా, మరికొందరు మాత్రం మంచి నిర్ణయం తీసుకుంది అని అంటున్నారు. బిజినెస్‌లోనైనా మీరా సక్సెస్ కావాలని ఆశిద్దాం. గుడ్‌లక్ టు మీరాచోప్రా....



ఈశ్వరరావు వరండాలోకి వచ్చి నిలబడ్డాడు. ఎదురుగా శిథిలావస్థలో కళాహీనంగా ఉన్న పెంకుటిల్లు! ఆ ఇంట్లోంచి ఓ కుర్రాడు బయటికి వచ్చి ఎక్కడికో వెళ్ళిపోతున్నాడు. కొన్నాళ్ళ క్రితం తన దగ్గరికి ఫీజు కోసం వంద రూపాయలు అడగడానికి వచ్చిన కుర్రవాడు ఇతడేనని గుర్తు వచ్చింది. ఆనాటి తన ప్రవర్తన కూడా గుర్తు వచ్చింది. ఒక బిచ్చగాడిని ఎలా విదిలించాలో అలానే విదిలించాడేమో! ఇతడు కాబోయే ఐ.ఎ.ఎస్. ఆఫీసరని తనకేం తెలుసు? కాని, తనారోజు అతడడిగిన సాయం చేస్తే, ఒక ఐ.ఎ.ఎస్ ఆఫీసరుకు అతడి పేదతనంలో సాయం చేసిన వ్యక్తిగా గుర్తుండిపోవడం నిజంగా గర్వించవలసిన విషయం. కాని అలా జరగక పోవడం తన దురదృష్టం!

ఒక అనామకుడి మనసులో తను చెడ్డవాడుగా మిగిలిపోతే బాధలేదు. కాని గొప్పవాడి మనసులో తను చెడ్డవాడుగా గుర్తుండిపోవడం – మనస్సు కలుక్కుమనేలా చేస్తుంది.

***

రమణ ట్రెయినింగ్ పూర్తి అయింది. సబ్ కలెక్టర్‌గా సిటీలోనే పోస్టింగ్ వచ్చింది. తనకోసం గవర్నమెంట్ ఇచ్చిన క్వార్టర్‌లో ఉంటున్నాడు.

ఒకనాడు ఒక ఇంజనీరుని వెంట బెట్టుకొని కారులో తమ పాత ఇంటి ముందు దిగాడు రమణ. ఇంజనీరు ఆ ఇంటి కొలతలు తీస్తున్నాడు. రమణ మాట్లాడుతున్నాడు. కొత్త ఇంటికి ప్లాన్ వేస్తున్నట్టుగా తెలిసిపోతూంది.

వీధిలో వాళ్ళ కళ్ళన్నీ వాళ్ళ మీదే ఉన్నాయి.

ముఖ్యంగా సవిత కళ్ళు, గేటులో నిలబడి అతడినే చూస్తూంది.

తను కోపంతో పెట్టిన పేరు 'పీరు కట్టె'.

కాని, ఇప్పుడా పేరు అతనికి ఎంత మాత్రం తగదు!

ఏపిల్ పండులా అందంగా తయారయ్యాడు. ఖరీదైన డ్రెస్‌లో ఉన్నాడు. హుందాగా ఉన్నాడు. గొప్ప ఆఫీసర్. ఆ కళ్ళు తనను ఆరాధనగా చూసేవి. ఇవాళ అవి తనకేసి చూడటం లేదు. చూసినా తను కనిపించనంత గొప్పవాడై పోయాడుగా. తన తండ్రి వడ్డీ వ్యాపారి. డబ్బుందేగాని ఒక అయ్యేఎస్ ఆఫీసరుని అల్లుడిని చేసుకొనే అంతస్తు మటుకి లేదు. ఇప్పుడతడు ఏ ఆఫీసరు కూతురినో, ఏ అద్భుత సౌందర్యవతినో పెళ్ళాడతాడు!

ఆ రోజుల్లో అతడి ప్రేమను అంగీకరిస్తే ఇవాళ తను అతడి భార్య అయ్యేది కాదూ.

దేనికైనా రాసిపుట్టాలంటారు. ఇదేనేమో!

సవిత కళ్ళ నిండా చెప్పలేనంత నిరాశ నిండుకుంది.

రమణ కారులో ఎక్కుతూ చూశాడు గాని వెంటనే ముఖం తిప్పేసుకున్నాడు. కారు స్టార్ట్ చేశాడు.

మూడు నెలల తిరగకుండా అక్కడొక అందమైన చిన్న మేడ వెలిసింది.

ఆ రోజు గృహ ప్రవేశం!

పనివాళ్ళతో, ఆహూతులతో కోలాహలంగా ఉంది.

ఆ కోలాహలం మధ్య వచ్చి ఆగింది రమణ కారు.

ముందు తాయారమ్మ దిగింది. తరువాత రమణ దిగి కారులోంచి ఒక ముసలామెను చెయ్యి పట్టి దింపి, ఎంతో జాగ్రత్తగా ఇంటి వైపు నడిపించసాగాడు. ఆమె తడుముకొన్నట్టుగా నడవడంలో ఆమె అంధురాలని అందరికీ తెలుస్తూంది.

'ఎవరామె' కుతూహలం అందరిలో.

ఆ మాట అతడినడిగితే, ఆరిపోతున్న దీపానికి చమురుపోసి వెలిగించిన ఒక దేవత అని జవాబు చెప్పి ఉండేవాడు.

ఆమె శారదమ్మ పెత్తల్లి. రమణ ఆమె కళ్ళు ఆపరేషన్ చేయించాడు గాని దురదృష్టవశాత్తూ ఆమెకు కళ్ళు రాలేదు! ఆమెకు కళ్ళు లేని లోటు రమణ, అతడి తల్లీ తీరుస్తున్నారు.

వీధంతా కార్లతో నిండిపోయింది.

ఖరీదైన జనం దిగుతున్నారు.

అబ్బురంగా చూస్తున్నారు వీధివాళ్ళు.

అతడిప్పుడు నివురు తొలగిన నిప్పు!

ఆ నిప్పు వెలుగులో, ఇదివరలో తాము అతడిపట్ల చూసిన అనాదరాన్ని ఉదాశీనతను గుర్తు చేసుకొని పశ్చాత్తాపపడుతున్న మనసులెన్నో!

*